క్లుప్తంగా

నేడు గంగాభవాని రథోత్సవం


గంగాభవాని

పెద్దకడబూరు : మండలంలోని చిన్నతుంబళం పంచాయతీ మజరా గ్రామమైన బాపురం గ్రామంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి రథోత్సవం గురువారం ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు, గ్రామ పెద్దలు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ మఠం పీఠాధిపతి బసలింగమ్మవ్వ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, గంగాపూజ, గణారాధన, కుంభ తీర్థం, మహా మంగళహారతి నిర్వహిస్తామని చెప్పారు. సాయంత్రం నందికోలసేవ, రథోత్సవం ఉంటుందని వివరించారు.

క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలి


మాట్లాడుతున్న మఠం పీఠాధిపతి బసలింగమ్మవ్వ

పెద్దకడబూరు : క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించాలని గంగాభవాని ఆలయ పీఠాధిపతులు శ్రీ బసలింగమ్మవ్వ సూచించారు. మండలంలోని నాగులపురం గ్రామంలో వెలసిన గంగాభవాని రథోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించనున్న జిల్లాస్థాయి కబడ్డీ పోటీలను గురువారం ప్రారంభించారు. నిర్వాహకులు మాట్లాడుతూ గెలుపొందిన జట్లకు వరుసగా రూ.20వేలు, రూ.15వేలు. రూ.10వేలు,రూ.2 వేలు అందజేస్తామని చెప్పారు. ఎస్ఐ శ్రీనివాసులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఖాదర్‌లింగ స్వామికి ప్రత్యేక ఫాతెహాలు


స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

కౌతాళం: మండల కేంద్రంలోని జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి ప్రత్యేక ఫాతెహాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో దర్గా పరిసరాలు నిండిపోయాయి. అంతకు ముందు తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీ స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు.

క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

కోసిగి: ఆదోని డివిజన్ పరిధిలో ఆర్డీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో మండల విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారని ఆర్డీటీ కోసిగి ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య తెలిపారు. గురువారం ఆదోని ఆర్డీటీ రీజినల్ కార్యాలయంలో రీజినల్ డైరెక్టర్ రామేశ్వరి సమక్షంలో డివిజన్ పరిధిలోని 3,4,5వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఇందులో మండల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి డివిజన్‌లో మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేసి అభినందించారు.

బాస్కెట్ బాల్ విజేతలకు అభినందనలు


క్రీడకారులను అభినందిస్తున్న దృశ్యం

కోసిగి: ఆదోని జోనల్ బాస్కెట్ బాల్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన కోసిగి మౌంట్ కార్మెల్ స్కూల్ విద్యార్థులను ప్రపంచ కార్మెల్ ఫౌండేషన్ అధ్యక్షుడు నీహోల్ కొనీల్ అభినందించారు. గురువారం ఐర్లాండ్ దేశం నుంచి వచ్చిన ఆయన స్కూల్‌ను సందర్శించారు. పాఠశాల పరిసరాలు పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించారు. మండలంలో నాణ్యమైన విద్యను అందించి విద్యార్థులను ఉత్తేజపరిచి మంచి ఫలితాలు సాధించేలా చూడాలని కరస్పాండెంట్ ఫాదర్ జిజో, ప్రిన్సిపాల్ జాన్సన్‌ను ఆదేశించారు.

హాల్విలో హుండీ చోరీ


హుండీని పగులగొట్టిన దృశ్యం

కౌతాళం: మండలంలోని హాల్వి గ్రామంలో వెలసిన రామకవ్వ దేవాలయంలోని హుండీ చోరీకి గురైనట్లు గురువారం స్థానికులు గుర్తించారు. గ్రామంలో వెలసిన రామకవ్వ దేవాలయంలో ఉన్న హుండీని తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు పగలగొట్టి అందులోని నగదును అపహరించుకెళ్లారు. హుండీలో సుమారు రూ.40వేల సొమ్ము ఉంటుందని చెప్పారు.

‘గడప గడప’తో గ్రామాల అభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సమస్యలకు పరిష్కారం చూపుతోంది. ఎన్నో ఏళ్లుగా పల్లెల్లో రోడ్లు, డ్రైనేజీలు, మంచినీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించినప్పుడు సమస్యలను వారి దృష్టికి తెస్తున్నారు. సమస్య తీవ్రతను గమనించిన సర్కారు వాటి పరిష్కారం కోసం ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు కేటాయించింది. ఎమ్మెల్యే సూచన మేరకు అధికారులు సమస్య తీవ్రతను పరిశీలించి ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నారు. దీంతో పల్లెల్లో సమస్యలకు కార్యక్రమం మార్గం చూపింది.



నూతన సీసీ రోడ్డును చూపుతున్న ఈమె పేరు నాగవేణి, ధణాపురం గ్రామస్తురాలు. ‘తమ కాలనీ గ్రామం చివరలో ఉండటం, ఏళ్లుగా సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇళ్ల ముందే మురుగు నీరు నిల్వ చేరి దుర్వాసన వెదజల్లేది. దీంతో కొందరు కాలనీ వాసులు వ్యాధులబారిన పడ్డారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సాయిరెడ్డి కాలనీలో పర్యటించినప్పుడు సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లాం. కొద్ది రోజుల్లో రోడ్డు, కాలువల పనులు పూర్తి చేయించారు’.

- ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షల మంజూరు
- పల్లెల్లో సీసీ రోడ్డు, డ్రైనేజీ, నీటి పైపులైన్ సమస్యలకు పరిష్కారం
- ప్రతిపక్షాల ఆరోపణలకు పనులతో సమాధానం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


ధణాపురంలో సీసీ రోడ్డు వేస్తున్న దృశ్యం

ఆదోని రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం ద్వారా గ్రామాభివృద్ధికి పెద్దపీట వేస్తుంది. గత మూడున్నరేళ్ల పరిపాలనలో ఇచ్చిన మాట మేరకు ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే గాకుండా గ్రామాల్లో అభివృద్ధి చేయాలని ఉద్దేశ్యంతో ఇంటింటికీ వెళ్లి (గడపగడపకు) ప్రజలతో మమేకమై, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకోవడమే గాకుండా సమస్యలపై ఆరా తీయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఈ కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాల విషయంలో అర్హులై ఉండి పథకాలు రాని వారికి కూడా పథకాలు అందేలా చూడాలని, అలాగే గ్రామాల్లో అభివృద్ధి విషయం, ఇతర సమస్యలపై ప్రజలతో నేరుగా మాట్లాడి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నిశాఖల అధికారులతో కలిసి గడప గడపకు తిరిగి, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు.

సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక అనేక అవస్థలు పడ్డాం



మా కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు లేక ఇన్నేళ్లు అవస్థలు పడ్డాం. వర్షం వస్తే ఇళ్ల ముందు మోకాళ్ల లోతు వరకు నీరు నిలిచేది. కనీసం కాలు మోపడానికి కూడా ఇబ్బంది పడ్డాం. ఎమ్మెల్యే మా ఊరికి వచ్చి సమస్యను చూసి వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీ మంజూరు చేయడంతో పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం మురుగు కాలువ సమస్య తీరింది.

– ములగేరి ఆంజనేయ, చిన్నపెండేకల్ గ్రామస్తుడు

సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు కృషి



ఇప్పటివరకు 13 సచివాలయాల్లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో పాల్గొన్నాం. ప్రజలు తెలిపిన సమస్యల మేరకు ఆయా గ్రామాల్లో ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, ఇతర సమస్యలు పరిష్కరిస్తున్నాం. ప్రస్తుతానికి 8 సచివాలయాల్లో పనులు ప్రారంభమై ముగింపు దశకు చేరుకున్నాయి. మరో ఐదు సచివాలయాల్లో త్వరలో పనులు ప్రారంభించనున్నాం.

– గీతావాణి, ఎంపీడీఓ, ఆదోని

గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు

ఆదోని మండలంలో 44 గ్రామాలు, 35 సచివాలయాలు ఉన్నాయి. ప్రస్తుతం 13 సచివాలయాల్లో ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం పూర్తయ్యింది. ఈ కార్యక్రమం ద్వారా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.20 లక్షలు మంజూరు చేసింది.

తీరనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల సమస్య..

‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమం ద్వారా ఎమ్మెల్యే, ఆయా శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించడంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, మంచినీరు,పైప్‌లైన్ తదితర సమస్యలు తీరనున్నాయి. ప్రస్తుతం చిన్నపెండేకల్, పెద్దపెండేకల్, ధణాపురం, బైచిగేరి, విరుపాపురం, బసరకోడు, అలసందగుత్తి, జాలిమంచి గ్రామాల్లో పనులు ప్రారంభమయ్యాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే పనులు ముగిశాయి. ఇంకా నాగనాథనహళ్లి, కపటి, సుల్తానపురం, గణేకల్ గ్రామాల్లో అభివృద్ధి పనులు ప్రారంభించాల్సి ఉంది.

సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి

కౌతాళం: గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని పొదలకుంట గ్రామంలో మంజూరైన పనులను పూర్తి చేసినట్లు పంచాయితీరాజ్ ఏఈ శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని ఆరు గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి పర్యటించిన సమయంలో స్థానికులు రోడ్డు సమస్యను ప్రస్తావించారని దీంతో ఒక్కో గ్రామానికి 20 లక్షలు రూపాయల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. పొదలకుంట గ్రామంలో రూ. 5లక్షలతో సిమెంటు రోడ్డు వేశామని, అలాగే మజారా గ్రామమైన అయిన మదిర గ్రామంలో కూడా రూ.5లక్షలతో సిమెంటు రోడ్డు, రూ.లక్షతో మరో రోడ్డు నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన రూ.9లక్షలతో పొదలకుంటలో సిమెంటు రోడ్డు, మదిరలో కూడా సిమెంటు రోడ్డు డ్రైనేజీల్ని ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. పొదలకుంట,మదిరలో మెయిన్ రోడ్ల నిర్మాణం పూర్తి కావడంతో స్థానికులకు మట్టి రోడ్డు సమస్య తీరిందని చెప్పారు.


పొదలకుంటలో సీసీ రోడ్డు వేసిన దృశ్యం


మదిర గ్రామంలో రోడ్డు నిర్మాణం పూర్తయిన దృశ్యం

ప్రభుత్వంపై విషపు రాతలు మానుకోవాలి

ఆదోని టౌన్ : రాష్ట్రంలో ఏ మూలనా ఎలాంటి చిన్న సంఘటన జరిగినా అందుకు ప్రభుత్వాన్ని నిందిస్తూ ఈనాడు పత్రిక విషపు రాతలను మానుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం సాయంత్రం పట్టణంలో ఈనాడు ప్రతులను దహనం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవా ఆధ్వర్యంలో కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు ర్యాలీగా ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్‌కు చేరుకుని ఈనాడు ప్రతులను దహనం చేశారు. వారు మాట్లాడుతూ గన్నవరంలో జరిగిన పట్టాభి వ్యక్తిగత సంఘటనపై ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. పట్టాభి వ్యక్తిగత విషయాలను సైతం ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నించడం దారుణమన్నారు. ఎప్పుటి ఫొటోలను తాజా సంఘటనలో చోటుచేసుకున్నట్లుగా చూపడం, ప్రభుత్వాన్ని బాధితులుగా పేర్కొనడం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని నిందించం తగదన్నారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సింది పోయి వ్యక్తిగత అంశాలను ఎత్తిచూపి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు.


ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్‌లో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

కేవలం చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రి చేయాలన్న ఉద్దేశంతో సీఎంపై బురదజల్లే ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో లింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, ముస్లిం, మైనార్టీ నాయకురాలు జిలేకాబీ, ఆదోని నియోజకవర్గ మహిళా విభాగం నాయకురాలు శ్రీలత, నాయకులు లక్ష్మీనారాయణ, తిమ్మప్ప, రమేష్, నారాయణ, బ్రహ్మం, రాముడు, వెంకటేష్, భీమలింగప్ప, ఈరన్న, ఏసేబు, గుంటెప్ప, శ్రీనివాసులు, వై.పి.గంగాధర్, హరికృష్ణ, సూరి, రంగస్వామి, బాబు, మల్లారెడ్డి, మల్లి, ఖాదర్, గణేష్, బాషాబాయ్, మస్తాన్, చంద్ర పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

హొళగుంద: ప్రభుత్వం పంపిణీ చేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసిన హొళగుంద బీసీ కాలనీకి చెందిన అల్లాబకాష్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అబ్దుల్‌జహీర్ గురువారం విలేకరులకు తెలిపారు. సదరు వ్యక్తి తన ఇంటి పక్కనున్న రేకుల షెడ్డులో 40 బస్తాల (20 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యంను అక్రమంగా నిల్వ చేయడంతో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

నేటి నుంచి ఉత్సవాలు

హొళగుంద: మండల పరిధిలోని నెరణికి తండాలో శుక్రవారం మునిస్వామి, చోకాస్వామిల మేటి కుంభోత్సవంతో పాటు రాత్రి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఆలయంలో జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే మేటి కుంభోత్సవం, పల్లకి ఊరేగింపు జరుగుతాయి. శనివారం మారెమ్మ దేవర కార్యక్రమం ఘనంగా జరుగుతుందని సర్పంచ్ పారుబాయి, ఎంపీటీసీ సంధ్యబాయి తెలిపారు. రెండు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి

ఆదోని అర్బన్ : ఆదోని రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో తనిఖీ చేపట్టి నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ పరిరక్షణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఆర్‌పీఎస్‌ఎఫ్) నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆఫీసు సబార్డినేట్ మంజునాథకు వినతి పత్రం అందజేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు పాటించకుండా రోగులను టెస్టులు, ట్రీట్‌మెంట్ పేరుతో నిలువుదోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. హెచ్‌ఆర్‌టీ స్కానింగ్‌కు రూ.800 నుంచి రూ.1500 వరకు తీసుకోవాల్సి ఉండగా, ప్రస్తుతం రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు వసూలు చేస్తున్నారు. అలాగే ఓపీ, టెస్టుల రేట్లు పెంచేశారనిని, స్పెషల్ రూముల పేరుతో వేలల్లో దండుకుంటున్నారని మండిపడ్డారు.అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. భీమ, కళ్యాణ్, పవన్, అజయ్ పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

ఆలూరు: జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను లబ్ధిదారులు వేగవంతం చేయాలని ఆదోని హౌసింగ్ ఈఈ గురుప్రసాద్ సూచించారు. దేవనకొండ మండలం గుండ్లకొండ గ్రామంలోని జగనన్న కాలనీలో నిర్మాణాలను ఆయన గురువారం పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలలో ఎదురవుతున్న ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈఈ గురుప్రసాద్ మాట్లాడుతూ.. నిర్మాణ పనులు వేగవంతం చేసేలా ఆయా లేఅవుట్‌లలో ఇసుక, ఐరన్, ఇతర సామగ్రి అందుబాటులో ఉంచడంతో పాటు నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. వచ్చే ఉగాది పండుగ నాటికి అన్ని కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఎంపీడీఓ గౌరీ దేవి, ఏఈ అనిరుధ్‌బాబు, వర్క్ ఇన్‌స్పెక్టర్ నీలకంఠేశ్వరనాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.


గుండ్లకొండ లేఅవుట్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ ఈఈ గురుప్రసాద్

మహిమాన్వితుడు గాదిలింగప్ప తాత

- నేటి నుంచి ఉత్సవాలు
- ఏర్పాట్లు చేసిన దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు

ఆలూరు: భక్తుల కొంగు బంగారం, ఆపదలో ఉన్న వారి దైవంగా వెలుగొందుతున్న గాదిలింగప్ప తాత ఉత్సవాలకు దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో కొలువుదీరిన గాదిలింగప్ప తాత ఉత్సవాలను ఈ నెల 23వ తేదీ నుంచి సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రారంభించి 25వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు.

ఆలయ చరిత్ర

హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలో అధికంగా కురుబ కులస్తులు ఉన్నారు. వీరందరూ గొర్రెలను మేపుకుంటూ జీవనం సాగించేవారు. అయితే కర్ణాటక రాష్ట్రంలోని మల్లివసిగేరి గ్రామంలో గాదిలింగప్ప తాత జన్మించారు. చిన్నతనం నుంచే దైవచింతన, ఆధ్యాత్మికతతో మెలుగుతూ వచ్చారు. ఇక్కడే ఉంటే లింగప్ప భవిష్యత్తుకు ఇబ్బందిగా ఉంటుందని కుటుంబ సభ్యులు భావించి అంబమ్మ దేవాలయం వద్దకు పంపారు. అక్కడ ప్రత్యేక యోగా ధ్యానంలో శిక్షణ పొందారు. అక్కడ సరిపడక అంబమ్మ అవధూత గూళ్యం గ్రామంలో వీరశైవ లింగాయత్ కులానికి చెందిన యోగి శ్రీ సిద్ధప్పయ్య తాత వద్దకు వెళ్లి శిష్యరికం చేయాలని సూచించారు. అక్కడ శిష్యరికం పొందిన గాదిలింగప్ప తాత అనేక మహిమలతో అగ్రజుడిగా ఆరితేరారు. గ్రామంలోని కురుబల వద్ద గొర్రెల కాపరిగా కొనసాగుతూ ఎన్నో మహిమలను చూపారు. అనంతరం పరమపదించిన తర్వాత గ్రామస్తులు, భక్తులు ఆయన ఆలయాన్ని నిర్మించి ఏటా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ మొక్కులు తీర్చుకునేవారు నైవేద్యంగా వండిన మాంసం, మద్యం, పూలు, టెంకాయలను సమర్పించి కోర్కెలను కోరుకుంటారు.


గాదిలింగప్ప తాత ఆలయం(ఇన్‌సెట్)గాదిలింగప్ప తాత ఉత్సవమూర్తి

జోడు రథోత్సవాలు ఇక్కడి ప్రత్యేకత

ఆలయంలో మూడు రోజుల పాటు భక్తుల నడుమ అంగరంగా వైభవంగా ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈనెల 23న ఉదయం 9 గంటలకు ప్రభోత్సవం, 24న 6 గంటలకు గురు శిష్యులైన సిద్ధప్పయ్య తాత, గాది లింగప్ప తాత జోడు రథోత్సవాలను ఆలయం నుంచి ఎదరు బసవన్న గుడి వరకు లాగనున్నారు. 25న ఉత్సవ ముగింపు, పూర్ణాహుతి కార్యక్రమాలతో పూర్తి చేస్తారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా సౌకర్యాలు



గాదిలింగప్ప తాత ఉత్సవాలకు ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వీరికోసం దేవస్థానం ఆవరణలో నిర్మించిన అన్నదాన సత్రాలలో వసతి కల్పిస్తున్నాం. మరికొందరికి ప్రత్యేకంగా గదులు కేటాయిస్తున్నాం. భక్తులకు తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశాం. రద్దీ ప్రాంతాల్లో బారికేడ్లు, అన్నప్రసాదాలు ఏర్పాటు చేశాం. భక్తుల సౌకర్యార్థం మూడు టికెట్ కౌంటర్లు ప్రారంభించాం.

– రాధాకృష్ణ, ఈఓ

సంతాన వరదా.. శ్రీరంగనాథ


పులికొండలోని రంగనాథ స్వామి ఆలయం,


పూజలందుకుంటున్న రంగనాథ స్వామి

పత్తికొండ రూరల్: మండల పరిధిలోని పులికొండ గ్రామంలో కొలువుదీరిన రంగనాథ స్వామి సంతాన వరదుడిగా పేరొందారు. సంతానం కలగని దంపతులు స్వామివారిని దర్శించుకుని ఇక్కడ బస చేయడం వల్ల సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. ఆలయంలో ఈ నెల 24 నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతుండటంతో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఈఓ బి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

పూజా కార్యక్రమాలు

24న శుక్రవారం కలశస్థాపన, పుణ్యాహవచనం, సాయంత్రం అంకురార్పణ, 25న శనివారం స్వామివారికి అభిషేకములు సహస్రనామార్చన, కంకణాధారణ, మహానైవేద్యం, సాయంత్రం పల్లకీ సేవ, ఉపన్యాసములు, 26న ఆదివారం ఉదయం 10:35 గంటలకు వృషభలగ్న శుభపుష్కరాంశమందు స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం రథపూజ, రథాంగ హోమం, బలిహరణం, 4:30 గంటలకు రథోత్సవం, రాత్రి 9 గంటలకు నందికోల సేవ, కాలక్షేప కార్యక్రమాలు 27న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం

గర్భగుడి ముందు భక్తులకు స్టీల్ పైపులతో క్యూలైన్ ఏర్పాటు, వసతి గృహముల నిర్మాణం, స్వామివారి ముఖమండపం, ప్రాకార మండపముల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ నుంచి నిధులు మంజూరు కావడంతో పనులకు శ్రీకారం చుట్టారు.

దేవాలయానికి వెళ్లే మార్గం

పత్తికొండ–కర్నూలు రోడ్డులోని కనకదిన్నె గ్రామం నుంచి క్రాస్ రోడ్డు మీదుగా 6 కిలోమీటర్ల దూరంలో స్వామి వారి ఆలయం ఉంది. పత్తికొండ నుంచి వయా కనకదిన్నె మీదుగా పులికొండ గ్రామానికి నేరుగా బస్సు సౌకర్యం కూడా ఉంది.

దక్షిణ, ఉత్తర దర్శన ద్వారాలు

దక్షిణ ద్వారం గూండా స్వామి వారిని నిత్యం భక్తులు దర్శించుకుంటారు. వైకుంఠ ఏకాదశి నాడు స్వామి వారిని దర్శించుకోవడానికి నూతనంగా ఉత్తర ద్వార దర్శన ప్రాకారాన్ని ఏర్పాటుచేశారు.

28న మండల సర్వసభ్య సమావేశం

ఆలూరు రూరల్: ఈ నెల 28వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అల్లబకాష్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మంగమ్మ, జెడ్పీటీసీ ఏరూరు శేఖర్ మండల ఎంపీటీసీలు, సర్పంచులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఓటీఎస్, ఆరోగ్య శాఖ, వ్యవసాయ, విద్యా శాఖ, తాగునీటి, విద్యుత్ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

మార్కెట్ వేలాలు మళ్లీ వాయిదా

ఆదోనిటౌన్: పట్టణానికి ఆదాయ వనరులైన ఝాన్సీ లక్ష్మి కూరగాయల మార్కెట్, పశువుల సంత, గొర్రెలు, మేకల, పశువుల కమేళాకు సంబంధించిన మార్కెట్ వేలాలు మళ్లీ వాయిదా పడ్డాయి. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేలంలో పాటదారులు ఎవరూ రాకపోవడంతో వాయిదా వేసినట్లు రెవెన్యూ ఆఫీసర్ అస్లాం తెలిపారు.

శిలాఫలకం పునర్నిర్మాణం

మద్దికెర: మండల కేంద్రంలో సుబ్రహ్మణ్య స్వామి దేవాలయం వెనుక హంద్రీ–నీవా కాలువ నుంచి మద్దమ్మకుంటకు నీటిని తరలించే పథకం ప్రారంభించినప్పుడు వేసిన శిలాఫలకం ప్రొక్లెయినర్ తగిలి పడిపోయింది. స్పందించిన ప్రొక్లెయిన్ యజమాని శిలాఫలకాన్ని పునర్నిర్మించేందుకు పనులు చేపట్టారు.

ఉత్సవాలు ప్రారంభం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామంలో వెలసిన ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి గంగ, ఆకుపూజ, అభిషేకం, పల్లకీసేవ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ

నందవరం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట గురువారం ఎస్ఐ మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 30 వాహనాలను గుర్తించి రూ.4,050 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్, ఆటో డ్రైవర్లు యూనిఫాం ధరించాలన్నారు. ఓవర్ లోడ్‌తో వాహనాలను నడిపితే, డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినా జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వరాదని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. తనిఖీల్లో ఏఎస్ఐ ఆనంద్, పోలీసులు సిబ్బంది అంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.